క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీని బుధవారం యారాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆమెను వీరంతా కలిసి తమ గ్రామంలో పర్యటించాలని కోరారు.దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.ఆమెను కలిసిన వారిలో పార్టీ నాయకులు వెంకట అప్పారావు,మధు తదితరులు ఉన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం గోపాలపట్నంకి చెందిన బొప్పన వాణి అనే దాత రూ. లక్షా 1116 విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

చురుగ్గా కులగణన



కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది, నాయకులు

మల్కాపురం: కులగణన ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. సామాజిక వర్గాల వారీగా వివ రాలు సేకరిస్తున్నారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ సచివాలయం పరిధిలో బుధ వారం సచివాలయ అడ్మిన్, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఏ సామాజిక వర్గానికి చెందిన వారో వివరాలు సేకరించారు. అలాగే 58,59,61వ వార్డుల పరిధిలో కుల గణన చేపట్టారు.

బాలికల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



జాతీయ సమ్మేళనంలో ప్రతిభ చూపిన విద్యార్థినిని దృశ్యం

మల్కాపురం: బాలికలు తమ ఆత్మరక్షణకు అవసరమైన విద్య నేర్చుకోవాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రతినిధులు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల అధ్యాపకురాలు ఎ.రోజా బాలికల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకోవాల్సిన జాగ్రతలు, ప్రస్తుత రోజుల్లో ఆకతాయిల దాడులను బాలికలు ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ సమ్మేళనంలో పాల్గొన్న కళాశాల విద్యార్థిని రొంగలి ఉజ్వలను అధ్యాపకులు సత్కరించారు.

శంకరనారాయణకు సీఐగా పదోన్నతి



శంకర నారాయణ

గోపాలపట్నం: ఇంటలిజెన్స్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వెలగాడ శంకర నారాయణ సీఐగా పదోన్నతి పొందారు. ఈయన 2009 బ్యాచ్‌లో ఎస్ఐగా చేరారు. గాజువాక, దువ్వాడ, కంచరపాలెం లా అండ్ ఆర్డర్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

సర్కారు బడి.. కార్పొరేట్ ఒరవడి

చదువే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి.. చదువుకుంటే తనను తాను, కుటుంబ స్థితిగతులను మార్చగలదు. అలాంటి విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించడానికి నాడు–నేడు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. బోధన పద్ధతులు మార్చడంతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చారు.

- నాడు– నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- సుమారు రూ. 2 కోట్లతో జీవీఎంసీ పాఠశాలల అభివృద్ధి
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



నాడు: దయనీయంగా ఇండస్ట్రియల్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల



నేడు: ఆహ్లాదకరంగా ఇండస్ట్రియల్ కాలనీ పాఠశాల



ప్రకాష్‌నగర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు గదులు





ఇండస్ట్రియల్‌కాలనీ పాఠశాలలో తరగతి గదులు

మల్కాపురం: నాడు ఆ రెండు పాఠశాలలు రంగులు వెలిసి, వెలగని లైట్లు, సరిగ్గా లేని బ్లాక్ బోర్డులు,అధ్వానమైన మరుగుదొడ్లతో పాటు అనేక సమస్యలు తాండవం చేసేవి. నేడు ఆ పరిస్థితి మారింది. కార్పొరేట్ పాఠశాలను మించిన సౌకర్యాలు కల్పించారు. ఆహ్లాదకరంగా తరగతి గదులు.. విశాలమైన ఆట స్థలాలు, పచ్చటి వాతావరణం కల్పించారు. జీవీఎంసీ 61వ వార్డులోని ప్రకాష్‌నగర్, ఇండస్ట్రియల్‌కాలనీల్లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల రూపురేఖలు మార్చారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో ఈ రెండు పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రకాష్‌నగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సుమారు రూ. 82 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

కల్పించిన సౌకర్యాలు

- తరగతి గదుల ఆధునికీకరణ
- అదనపు గదుల నిర్మాణం, పాఠశాలలో మైదానం అభివృద్ధి
- తాగునీరు,మరుగుదొడ్ల ఆధునికీకరణ
- తరగతి గదుల్లో అధునాతన సౌకర్యాలతో కూడిన బల్లలు,కుర్చీలు
- తరగతి గదుల్లో విజ్ఞానం పంచే రంగులు,బొమ్మలు అమర్చారు
- క్రీడామైదానంతో పాటు పరిసరాల్లో పచ్చదనం పెంపు

ఇండస్ట్రియల్‌కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సుమారు రూ.77 లక్షలతో ఆధునికీకరించారు.

- తరగతి గదుల ఆధునికీకరణ
- విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం
- ఆహ్లాదకరంగా తరగతి గదులు,మెరుగైన విద్యుత్ లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు
- పాఠశాలలో విశాలమైన క్రీడామైదానం అభివృద్ధి
- అదనపు తరగతి గదులు నిర్మాణం
- క్రీడామైదనం చుట్టూ మొక్కల పెంచడం





నాడు: అధ్వానంగా ప్రకాష్‌నగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల



నేడు: వసతులు కల్పించిన తర్వాత ప్రకాష్‌నగర్ జీవీఎంసీ పాఠశాల

చాలా ఆనందంగా ఉంది



మా పాఠశాల పూర్తిగా శిథిలావస్థలో ఉండేది. నేడు ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. నాడు పాఠశాలకు రావాలంటే విసుగు పుట్టేది. నేడు అన్ని సౌకర్యాలు కల్పించారు. తరగతి గదులు ఆహ్లాదకరంగా ఉన్నాయి. పాఠశాల మానాలంటే మనసు ఒప్పడం లేదు. ఇంతటి సౌకర్యాలు కల్పించిన పాలకులకు మా కృతజ్ఞతలు.

– కరిష్మా, 5వ తరగతి, ఇండస్ట్రియల్‌కాలనీ

బోధన బాగుంది



మొన్నటి వరకు రెండు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు బోధించేవారు. నేడు ప్రతి సబ్జెక్ట్‌కు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. దీంతో మాకు అర్థమైన రీతిలో బోధిస్తున్నారు. సందేహాలను కూడా నివృతి చేస్తున్నారు.

–జశ్వంత్, 5వ తరగతి, ప్రకాష్‌నగర్ స్కూల్

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య



పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ ఉన్నతకు దూరం కాకూడదనే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. ఆయన ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలి.పశ్చిమలో మిగిలిన పాఠశాలను ఇదే రీతిలో అభివృద్ధి చేస్తాం.

– ఆదారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పాఠశాలలను నాడు– నేడులో అభివృద్ధి చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది.

–కొణతాల సుధ, వార్డు కార్పొరేటర్

బాలికలకు తమ హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుకన్య, అధ్యాపకులు

గోపాలపట్నం: బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బెహరా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. నరవలోని బెహరా కళాశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరంగాల్లో బాలికలు ముందంజలో ఉన్నా వివక్షకు బలవుతూనే ఉన్నారన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకునే విధంగా బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. బాలికల హక్కుల గురించి వివరించారు. బెహరా విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, కళాశాల అధ్యాపకులు కీర్తి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం- ఆంధ్రా’ పోటీలు



టాస్ వేసి క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శారదారావు, కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం షిప్‌యార్డ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రికెట్ ఆర్గనైజింగ్ కమిటీ నేతృత్వంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సౌజన్యంతో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ శారదారావు టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు శైలజ, రమణ, నీరజ, దేవుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట: జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాలకు సంబంధించి 60:40 నిష్పత్తిలో కాకుండా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఉచితంగా లేదా నామమాత్రపు ధరకు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే స్టేట్ హెడ్ క్వార్టర్‌లో పని చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోవాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఏ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ కోరారు. 2023లో అక్రిడేషన్ లేనప్పటికీ గతంలో కలిగి ఉంటే వారికి కూడా స్థలాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతోనూ, ఆ తర్వాత మరణించిన జర్నలిస్టుల తరఫున వారి కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలు తీసుకెళ్తామని, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. విశాఖ జిల్లా వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె. చంద్రమోహన్, ఎల్ఎన్ఏ కోశాధికారి ఆర్.అబ్బాస్, ప్రతినిధులు బండారు శివప్రసాద్, బిఏ నాయుడు, ఏపీజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీధర్, ఎం. శ్రీహరి, ఎస్. మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలి రండి



శాంతినగర్: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జియ్యాని శ్రీధర్



గోపాలపట్నంలో కార్యకర్తలనుశిద్దేసించి మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ప్రజలకు మేలు చేసిన నాయకుడి వెంటే జనమంతా ఉంటారని, మనమంతా ఉండాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఈ నెల 27న భీమిలి నియోజకవర్గం సంగివలసలో జరగనున్న ముఖ్యమంత్రి సమావేశం నేపథ్యంలో బుధవారం వీరు వేర్వేరుగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జియ్యాని శ్రీధర్, గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో బెహరా భాస్కరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందని, దానిని ఎవరూ మర్చిపోకూడదన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశానికి వార్డుల్లో ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమల్లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, పార్టీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, వెదుళ్ల శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

మాతృమాల సేవకుడు వెంకటరావుకు నివాళి



వెంకటరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: మాతృమాల సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోన వెంటరావు సేవలు స్ఫూర్తిదాయకమని గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు కొనియాడారు. గోపాలపట్నంలోని కళా సేవా పీఠం కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ ఈ సమాజం మంచి సేవకుడిని కోల్పోయిందన్నారు. మాతృ మూర్తులను గౌరవించాలని.. వారిని నిర్లక్ష్యం చేయవద్దని ఆకాంక్షించేవారని కొనియాడారు. 20 ఏళ్లుగా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహించారని.. అవి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కళాసేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు, ఉపాధ్యక్షుడు గంపల అప్పారావు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

గోపాలపట్నం: సాదనా గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలపట్నం ఎస్ఆర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ ఇ.సత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందని చెప్పారు. ఎముకలు, జనరల్ మెడిసన్, మహిళా వైద్య నిపుణులు, జనరల్ సర్జన్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉచితంగా బీపీ, సుగర్, ఎక్స్‌రే పరీక్షలు చేస్తామన్నారు. వివరాలకు 95533 55821, 63010 79746 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌గా పెందుర్తి



వీసీ ప్రసాదరెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

పెందుర్తి: నగరంలో ఉత్తమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా పెందుర్తి ఎంపికైంది. ఈ మేరకు నగరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ సమక్షంలో ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి రమేష్ అవార్డు అందుకున్నారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిబద్ధత అభినందనీయం



మాట్లాడుతున్న గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: ఆర్టీసీ మనుగడకు డ్రైవర్లు చూపుతున్న నిబద్ధత అభినందనీయమని గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం గాజువాక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో అతిథిగా ఆమె మాట్లాడారు. ఎంతో మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ డ్రైవర్లు అంకితభావంతో పనిచేస్తున్నాన్నారు. ప్రమాదరహిత ప్రయాణాలు సాగిస్తూ తమ డ్రైవర్లు ఉత్తమంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బస్సును జాగ్రత్తగా నడుపుతున్న డ్రైవర్ పి.వి.పి.రాజును అభినందించారు. కార్యక్రమంలో గాజువాక డిపో చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమణమ్మ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఎంయూ యూనియన్ ప్రతినిధులు, 150 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధి బంటా కాలనీలో సీసీరోడ్లు, కాల్వ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రూ. 25లక్షలతో రహదారులు, కాల్వ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఏ మసస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నాయకులు కంచిపాటి జగదీష్, శంకరరావు, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

నందవరపు సోములుకు విశిష్ట సేవా పురస్కారం



సినీనటులు ఆమని, రోజామణి చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారం అందుకుంటున్న సోములు

గోపాలపట్నం: శోభన్ బాబు సేవా సమితి వ్యవస్థాపకుడు నందవరపు సోములు ఈ నెల 21న హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో శోభన్ బాబు విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ శోభన్ బాబూ సేవా సమితి, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సోములుకు పురస్కారాన్ని ప్రముఖ సినీనటి ఆమని, రోజామణి అందించారు. నిర్వాహకులు రామకృష్ణ, ఆర్. పద్మారావు తదితరులు సోములు చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్నికల శంఖారావాన్ని జయప్రదం చేద్దాం



63వ వార్డులో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

సింధియా: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న భీమిలి సంగివలసలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్నికల శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ సుపరిపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. 18 నెలల వ్యవధిలో తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి, సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. వార్డు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లి, సీఎం సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, ఎస్సీ సెల్ నాయకులు పూండీ మల్లేష్, కొట్యాన రవి, ఇతర నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి కుటుంబానికి బీమా నగదు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌కు చెందిన అర్జాల రవికుమార్(42) ములగాడలోని శ్రావణ్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తూ గత నెల 26న ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు వైఎస్సార్ బీమా కలిగి ఉండటంతో రవికుమార్ కుటుంబ సభ్యులను బుధవారం కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మిగిలిన బీమా నగదు మొత్తం మృతుడి నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరూ ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాయల సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.